సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 19 । జులై । 2024



స్వచ్ఛమైన తాగునీరు అందించాలి
అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజలకు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. - 8లో..



రానున్నది జగనన్న సునామీ
త్వరలో జగనన్న సునామీ వస్తుందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33/28

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా మూర్తి



ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సిలర్‌గా డీవీఆర్ మూర్తిని నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం ఆంధ్రా యూనివర్సిటీలో జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగం హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి ఇటీవల రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మూర్తిని నియమించారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వీసీగా మూర్తి కొనసాగనున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జీవాల పెంపకందారులకు జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి పిలుపు

పొదిలి రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టరు బేబీరాణి పిలుపునిచ్చారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వ్యాధులు వచ్చి జీవాలు చనిపోకముందే టీకాలు వేయించడం మంచిదన్నారు. అధికారులు ముందుగా ప్రతి గ్రామంలో ఉండే గొర్రెలు, మేకల వివరాలు నమోదు చేసుకుని అవసరమైన టీకాలను ఉచితంగా వేయాలన్నారు. వ్యాధులపై పెంపకందారులకు అవగాహన కల్పించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి చోటా ఎన్ని రకాల జీవాలున్నాయి, వాటికి ఏఏ రకాల వ్యాధులున్నాయని గుర్తించి టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం డివిజన్‌లోని ఏడీలు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన శోధన..

తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు ప్రయోగాలు, పరిశోధనల వైపు అడుగులు వేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహిస్తోంది. తద్వారా భావిభారత పరిశోధకులను తయారు చేస్తోంది. అందుకోసం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో ప్రతిభాన్వేషణ పరీక్ష నిర్వహిస్తోంది. జాతీయ స్థాయిలో ఏటా 6 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థుల్లో ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ అవకాశం కల్పిస్తూ దేశానికి గొప్ప సైంటిస్టులను అందించేందుకు కృషి చేస్తోంది. జిల్లాలో సుమారు 1.85 లక్షల మంది విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పిస్తోంది.

- విద్యార్థి విజ్ఞాన మంథన్ పేరుతో ఏటా కేంద్ర ప్రభుత్వం పరీక్ష నిర్వహణ
- 6 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవకాశం
- ప్రతిభ చూపితే ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్
- ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

బేస్తవారిపేట:

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ఆవిష్కరణల వైపు ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పరిశోధనలు, ప్రయోగాలలో విద్యార్థులు రాణించేలా ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయ స్థాయిలో ప్రతిభాన్వేషణ పరీక్షను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తంగా వీవీఎం పరీక్ష నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం 2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 6 నుంచి ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఎంపీసీ, బైపీసీ చదువుతున్న వారిలో ఆసక్తి గల విద్యార్థులకు స్టేట్‌బోర్డు, సీబీఎస్‌ఈ, ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుంది.

జూనియర్, సీనియర్ విభాగాలలో...

వీవీఎం పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులను జూనియర్ కేటగిరీగా, 9 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను సీనియర్ కేటగిరీగా విభజించి పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఇంగ్లిషు తదితర భారతీయ భాషల్లో పరీక్ష ఉంటుంది. విద్యార్థుల ఆసక్తిని బట్టి వారికి నచ్చిన భాషల్లో పరీక్ష రాయవచ్చు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక ఇలా...

పాఠశాల స్థాయిలో ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6 నుంచి ఇంటర్ వరకు మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. వారిలో ప్రతిభ చూపిన వారిని ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 18 మందిని జాతీయ స్థాయి పరీక్షకు ఎంపిక చేస్తారు.

నవంబర్, డిసెంబర్‌లో పరీక్ష...

రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3, 10, 17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన వారికి వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలతో పాటు మెమొంటో, సర్టిఫికెట్ అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసపత్రం ఇస్తారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక ఇలా...

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిలో ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల చొప్పున మొత్తం 12 మందిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పరీక్షకు ఎంపిక చేస్తారు. వారిలో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు విద్యార్థుల చొప్పున మొత్తం 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలతో పాటు మెమొంటో, సర్టిఫికెట్ అందజేస్తారు.

దరఖాస్తు విధానం ఇలా...


ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రుసుం చెల్లించి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది మే 19న రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా, సెప్టెంబర్ 15వ తేదీతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది. ఇందుకు సంబంధించిన పరీక్ష అక్టోబర్ 23 లేదా 27 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 90 నిమిషాలు జరుగుతుంది. ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ పద్ధతిలో పాఠశాల స్థాయిలోనే నిర్వహించనున్నారు. పరీక్ష జరిగే రోజు విద్యార్థులు వారికి అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, డిజిటల్ పరికరాల్లో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్షకు నిర్దేశించిన అప్లికేషన్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వారి ఇంటి నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పరీక్షలు ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఇప్పటికే వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

100 మార్కులకు పరీక్ష...

ఈ పరీక్షకు సంబంధించి మాక్ పరీక్షను అక్టోబర్ 10న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 23 నుంచి 27 తేదీల్లో (ఏదో ఒక రోజు మాత్రమే) ఉంటుంది. అయితే, అందులో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య కాలంలో 90 నిమిషాల పాటు పరీక్ష రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే ప్రతి విద్యార్థి ఒకసారి యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లో 100 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ప్రకారం 100 మార్కులు కేటాయిస్తారు. సెక్షన్-ఏలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20 ప్రశ్నలు, శాంతి స్వరూప్ భట్నాగర్ జీవిత చరిత్రపై 20 ప్రశ్నలు, సెక్షన్-బీలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల నుంచి 50 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్‌పై 10 ప్రశ్నలు ఉంటాయి.

జిల్లాలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 1,64,575 మంది...

జిల్లాలో మొత్తం 1,64,575 మంది విద్యార్థులు 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. వారిలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థులు 34,015 మంది, 7వ తరగతి 34,893, 8వ తరగతి 32,694, 9వ తరగతి 32,080, 10వ తరగతి 30,893 మంది విద్యార్థులు చదువుతున్నారు. జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులు సుమారు 19,000 మంది ఉంటారు. వీరిలో ఆసక్తి ఉన్న వారు విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రతిభ చూపేందుకు చక్కటి వేదిక



జాతీయ స్థాయిలో ప్రతిభ చూపేందుకు ఇదొక చక్కటి వేదిక. శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పొందేందుకు మంచి అవకాశం. ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యక్తిగత లేదా పాఠశాలల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌ఎఫ్‌ఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వవచ్చు.

– సీహెచ్ రమణారెడ్డి, ఎంఈఓ, బేస్తవారిపేట

మీడియాలో అసత్య ప్రచారాలు ఆపాలి

- గిరిజన మహిళకు రక్షణ కల్పించాలి
- ప్రజాసంఘాల ర్యాలీ, ఎస్పీకి ఫిర్యాదు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న గిరిజన మహిళ శాంతిపై అసత్య ప్రచారాలు చేస్తున్న టీవీ5 చైర్మన్ సాంబశివరావు, మహా న్యూస్ చైర్మన్ వంశీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. గిరిజనులలో ఉన్నత చదువులు చదువుకున్నవారు తక్కువగా ఉంటారని, పైగా ఉన్నతోద్యోగం చేసే వారు కూడా చాలా తక్కువగా ఉంటారని తెలిపారు. అలాంటి వారిని రాజకీయ దురుద్దేశాలతో టార్గెట్ చేసి వేధించడం క్రూరమని ప్రజా సంఘాల కన్వీనర్ పేరం సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎలాంటి సమస్యలు లేనట్టు గిరిజన మహిళ ఉదంతాన్ని మాత్రమే ప్రసారం చేయడం అనైతికమన్నారు. వెంటనే టీవీ 5 సాంబశివరావు, మహాటీవీ వంశీ, మహాటీవీ న్యూస్ యాంకర్ లక్ష్మిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కులాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, యానాదుల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర కన్వీనర్ బొడ్డు శ్రీనివాసరావు, దండోరా రాష్ట్ర నాయకులు అంజనేయులు, ముస్లిం హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ బుజ్జి, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావల సుధాకర్, దళిత సంఘాల నాయకులు సామేల్, రాయపాటి మూర్తి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాటిపర్తి వెంకటస్వామి, కాలేబ్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి ఫైల్స్ అక్కడే..!

- బదిలీల సాకుతో పనులు పక్కన పెట్టిన అధికారులు
- ఎన్నికల విధులకు వచ్చిన అధికారుల బదిలీల్లో జాప్యం
- బదిలీ ఉత్తర్వుల కోసం ఎదురు చూపులు
- జాప్యాన్ని సాకుగా చూపి ఫైల్స్ పెండింగ్ పెడుతున్న వైనం

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధుల నేపథ్యంలో పొరుగు జిల్లాల నుంచి మన జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు, అధికారులు తిరిగి వారి జిల్లాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారు. ఎలాగో బదిలీ అవుతామనే ఉద్దేశంతో వారి కార్యాలయాల్లో పనులు చేయకుండా పెండింగ్ పెడుతున్నారు. ప్రధానంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పనులన్నీ పెండింగ్ పడటంతో ప్రజలు తీవ్రస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా ఎన్నికల విధుల కోసం ఇతర జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది బదిలీలకు ఇంతవరకూ చర్యలు చేపట్టలేదు. ఇంత ఆలస్యం గతంలో ఎప్పుడూ కాలేదంటూ అధికారులు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం మన జిల్లా అధికారులు, ఇతర జిల్లాలకు, ఇతర జిల్లాల అధికారులు మన జిల్లాకు రావడం పరిపాటి. అయితే, ఎన్నికలు ముగిశాక తిరిగి వారిని సొంత జిల్లాలకు పంపిస్తారు. అనంతరం జిల్లాల్లో బదిలీలు జరుగుతాయి. ఈ బదిలీలన్నీ జాప్యం కావడంతో కార్యాలయాల్లో పనులపై ఆ ప్రభావం పడుతోంది. అయితే, ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుని మండలాలు కోరుకునేందుకు మన జిల్లాకు సంబంధించిన అధికారులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అయితే, ఎన్నికల పూర్తయి ప్రభుత్వం ఏర్పాటైనా ఇంత వరకు బదిలీల ఊసే లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రజలు ఏ పని మీద కార్యాలయాలకు, కలెక్టరేట్ విభాగాలకు వెళ్లినా బదిలీలు అవుతాయనే సాకుతో ఆ పనులను పక్కన పెడుతున్నారు. మండల స్థాయిలో పాలన పూర్తిగా పడకేసినట్లు తెలుస్తోంది. ఏ పని చేస్తే ఏమవుతుందో అని పొరుగు జిల్లాల తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పనుల్లో నెమ్మదిస్తున్నారు. దీనికితోడు రాజకీయ ఒత్తిడితో కూడా పనిచేయాలంటే అనాశక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. బదిలీలు ఆలస్యమైనా పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా డిగ్రీ కాలేజీకి స్వయం ప్రతిపత్తి

వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కళ్యాణి

ఒంగోలు: తమ కాలేజీకి స్వయం ప్రతిపత్తి హోదా దక్కడం ఆనందంగా ఉందని స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అన్నారు. గురువారం ఆ వివరాలను ఆమె వెల్లడించారు. మహిళాభివృద్ధికి 1984లో కేవలం రెండు కోర్సులతో ఈ కాలేజీ ప్రారంభమైందని తెలిపారు. 1996లో దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీగా మార్పు చెందిందన్నారు. విశాలమైన ప్రాంగణంలో సొంత భవనాలతో అత్యధిక వసతులతో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్.. అంటే న్యాక్ ద్వారా 2007లో బీ+, 2014లో బీ, 2024లో ఏ+ సాధించడం జరిగిందన్నారు. అది కూడా 3.35/4 స్కోరు సాధించామన్నారు. ఫలితంగా ఇప్పటి నుంచి పది సంవత్సరాలపాటు స్వయం ప్రతిపత్తి హోదా కాలేజీకి దక్కుతుందన్నారు. స్వయం ప్రతిపత్తి పొందడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాలేజీలో జవహర్ నైపుణ్య కేంద్రం ద్వారా నైపుణ్యాలతో కూడిన విద్య అందించగలుగుతున్నామన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మల్టీ నేషనల్ కంపెనీస్‌తో ఒప్పందం కుదుర్చుకుని వాటిలో ఇంటర్న్‌షిప్, జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో విద్యార్థులు లబ్ధిపొందుతారన్నారు. ఐఎస్‌వో గుర్తింపు సర్టిఫికెట్ పొందిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ జిల్లాలో ఇదే మొదటిదన్నారు.

కాలేజీలోని వసతులు, కోర్సులు...

కాలేజీకి స్వయం ప్రతిపత్తి హోదా దక్కిన సందర్భంగా కాలేజీలోని వసతులు, కోర్సుల వివరాలను ప్రిన్సిపాల్ కళ్యాణి వెల్లడించారు. కాలేజీలో వందకు పైగా కంప్యూటర్లు, ఆధునీకీకరించిన బోటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ ల్యాబులు, సువిశాలమైన క్రీడా ప్రాంగణం, ఆధునికీకరించిన డిజిటల్ లైబ్రరీ, నూతనంగా 30 కంప్యూటర్లు కలిగిన జవహర్ నైపుణ్య కేంద్రం, 30 ల్యాప్‌టాప్‌లు కలిగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది నుంచి బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ, బోటనీ) కోర్సుతో పాటు బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం ఆనర్స్ జనరల్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బాచులర్ ఆఫ్ ఒకేషనల్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) కోర్సుల్లో ప్రవేశాలు కోరుతున్నామన్నారు. ప్రస్తుతం స్వయం ప్రతిపత్తి వల్ల కాలేజీకి సొంత విద్యా ప్రమాణాలు, పాఠ్యాంశాలు ఏర్పాటు చేసుకోవడానికి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్య పొందేందుకు సిద్ధంగా ఉంటే స్వయం ప్రతిపత్తి కాలేజీలు అద్భుతంగా ఉంటాయన్నారు. మార్కెట్‌లో నైపుణ్యం సాధించేందుకు సరికొత్త, సంబంధిత సాంకేతికతలను బోధిస్తారని తెలిపారు. వివిధ పరిశ్రమల నిపుణులు ప్రసిద్ధ సంస్థల నుంచి అనుభవజ్ఞులైన విద్యావేత్తలను సంప్రదించి రూపొందించిన సిలబస్ చదివిన విద్యార్థులకు ఉపాధి సులువుగా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో సాంకేతిక నైపుణ్యం కలిగిన, నిర్వహణ నైపుణ్యం కలిగిన వారికి భారీ డిమాండ్ ఉందని తెలిపారు. జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక శిక్షణ, పాఠ్యప్రణాళిక కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి



వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

- ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాలు
- ఒంగోలు తాలూకా, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

ఒంగోలు టౌన్: గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. నేరాలు జరగకుండా, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేసే విధంగా ముమ్మరంగా గస్తీ చేపట్టాలని సూచించారు. గురువారం సాయంత్రం ఒంగోలు తాలూకా, వన్‌టౌన్ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న పోలీసుల పనితీరు, డ్యూటీల కేటాయింపు, ఫిర్యాదుల స్వీకరణ విధానం, స్టేషన్ పరిధిలోని మ్యాపులు, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనంతో ఆహ్లాదంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఓర్పుగా వారితో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకోవాలని సలహా ఇచ్చారు. ఫిర్యాదుల పట్ల సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేసేందుకు తగిన విచారణ చేయాలన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని సూచించారు. స్టేషన్లలో పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలని, పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, దొంగతనాలను కట్టడి చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. చోరీ కేసుల్లో ప్రాపర్టీ రికవరీకి ప్రాధాన్యత ఇవ్వాలని, నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బందిని తరచూ అప్రమత్తం చేయాలని చెప్పారు. స్టేషన్లలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సైతం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ కిశోర్‌బాబు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, తాలూకా సీఐ షేక్ ఖాదర్‌బాషా, వన్‌టౌన్ సీఐ షేక్ అలీ సాహెబ్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- మంత్రి నారాయణ

ఒంగోలు: ప్రస్తుతం వర్షాల సీజన్ ప్రారంభమైన దృష్ట్యా కలుషిత నీరు కారణంగా డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ నారాయణ తెలిపారు. గురువారం రాత్రి ఒంగోలు వచ్చిన ఆయన.. స్థానిక కొత్తపట్నం బస్టాండు రైతు బజార్ ఆవరణలో, నెల్లూరు బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గల పాత అన్నా క్యాంటీన్లను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి పరిశీలించారు. వ్యాధుల నివారణపై రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీలు, 17 నగరపాలక సంస్థల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. డ్రెయిన్ల పూడికతీతకు రూ.50 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వచ్చే పదిరోజుల్లో అన్ని డ్రెయిన్లలో వందశాతం పూడికతీత పనులు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మున్సిపాల్టీల్లో డ్రెయిన్ వాటర్‌ను శుద్ధి చేసేందుకు సీవరేజి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ నిమిత్తం రూ.300 కోట్లు అవసరమని ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. ఆ మేరకు ముఖ్యమంత్రి నిధులు మంజూరుచేశారన్నారు. పోతురాజు కాలువ విషయాన్ని ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు, కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖాధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలని, వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఓపీఎస్ అమలుపై తక్షణ చర్యలు తీసుకోవాలని యూఎం అండ్ హెచ్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు కోరారు. పీఆర్‌సీపై సత్వర నిర్ణయం తీసుకుని ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జి.అనిత, సీహెచ్ పూర్ణాదేవి, ఆర్.హైమావతి, ఉమామహేశ్వరరావు, విజయభాస్కర్, జి.నాగేశ్వరరావు, హనుమంతరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22 నుంచి శిక్షా సప్తాహ్

ఒంగోలు: జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు అయిన సందర్భంగా ఈనెల 22 నుంచి 28వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారుచేసి ప్రదర్శించాలని, 23న పునాది అభ్యసన.. సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు అవగాహన కలిగించాలని చెప్పారు. 24న విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం చేపట్టాలని కోరారు.

20న అండర్ 16 షూటింగ్ బాల్ సెలక్షన్స్

టంగుటూరు: అండర్–16 బాల బాలికల షూటింగ్ బాల్ సెలక్షన్స్ ఈ నెల 20న జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు షూటింగ్ బాల్ సెక్రటరీ వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనే బాల బాలికలు 2008 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. సెలక్షన్స్‌కి వచ్చేటప్పుడు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తీసుకురావాలని చెప్పారు. ఎంపికైన జట్టు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8919591417 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లోకేష్ మాటలు ప్రగల్భాలేనా!

- 108 జీఓ రద్దు మాట ఏమైంది?

ఒంగోలు టౌన్: గత ప్రభుత్వం విడుదల చేసిన 107, 108 జీఓలను యథాతథంగా కొనసాగించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హై కోర్టులో స్పష్టం చేయడం అంటే విద్యార్థులను మోసగించినేనట్లనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తమ ప్రభుత్వం రాగానే రద్దు చేసే బాధ్యతను నేను తీసుకుంటానని యువగళం యాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాడు ఇచ్చిన హామీ ఒట్టి ప్రగల్భాలేనా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తరువాత తెప్ప తగలేసిన చందంగా అదే జీఓను కొనసాగించాలని నిర్ణయించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట ప్రకారం 107 , 108 జీవోలను రద్దు చేసి ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు కొత్త మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి


రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొండపి(సింగరాయకొండ):

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కొండపి మండలం కేంద్రంలోని గ్రామీణ రక్షిత మంచినీటి పథకాన్ని గురువారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా తాగునీటి పథకానికి సంబంధించిన రాపిడ్ శాండ్ ఫిల్టర్స్ యూనిట్, పంపుహౌస్, వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌ను, సంబంధిత రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వాటర్ శాంపిల్స్‌ను పరీక్షిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. రూ.40 కోట్లతో తాగునీటి పథకం చేపట్టామని, ఈ పథకం ద్వారా కొండపి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల 27 గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నామని అధికారులు కలెక్టర్ అన్సారియాకు వివరించారు. కొండపి నుంచి జాళ్లపాలెం వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న చెత్తను చూసి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ నుంచి చెత్తను తొలగించాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్ధన్ ఆలీ, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

రానున్నది జగనన్న సునామీ

- అధైర్యపడొద్దు..అందరికీ మేలు జరుగుతుంది
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


ప్రభపై నుంచి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో టీడీపీ కూటమి నాయకులు విర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బోయలపల్లెలో జరిగిన ఆత్మానంద స్వామి తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై నుంచి ఆయన మాట్లాడారు. రానున్న జగనన్న సునామీని ఎవ్వరూ తట్టుకోలేరన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, లైంగిక దాడులు, అల్లర్లు మాత్రమే కనిపిస్తున్నాయని, అభివృద్ధి ఏ కోశాన కనిపించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం 2019లో జగనన్న సునామీ వచ్చిందని, ఈ సునామీ ప్రజలందరికీ మేలు చేసేలా ఐదేళ్ల పాటు శాంతి, భద్రతలు కాపాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా పాలన సాగించిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైనా అమ్మఒడి పథకంపై ఇంత వరకు ప్రభుత్వం ప్రకటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మఒడి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు ఏ విధంగా అమలు చేయాలన్న ఆలోచనలో పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో టీడీపీ వర్గీయులు సృష్టిస్తున్న అరాచకాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించాలని సూచించారు.

తిరిగి జగనన్న అధికారంలోకి వచ్చి సునామీ సృష్టిస్తారని మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఆత్మానంద స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏకుల ముసలారెడ్డి, మాగులూరి వెంకటేశ్వర్లు, బొల్లా వెంకటేశ్వర్లు, మన్నెం వెంకటేశ్వర్లు, దుగ్గినేని శేషయ్య, కొచ్చర్ల రఘు పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న ప్రజలు

లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ తార శ్రీలీల


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ తార సంయుక్త మీనన్, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట , ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత తదితరులు

- సందడి చేసిన శ్రీలీల, సంయుక్త మీనన్

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులో లక్కీ షాపింగ్ మాల్ గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సినీ తారలు శ్రీలీల , మరోనటి సంయుక్త మీనన్ హాజరై సందడి చేశారు. ఈ మాల్‌ను మంత్రి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. గత 15 ఏళ్లుగా వస్త్ర వ్యాపారంలో విజయవంతంగా రాణిస్తూ నేడు స్వగ్రామమైన ఒంగోలులో 11వ బ్రాంచిని ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ ఒంగోలు నాకు కొత్త కాదు కానీ, లక్కీ షాపింగ్‌మాల్ ను చూస్తుంటే కొత్తగా కనిపిస్తుందని చెప్పారు. మరోనటి సంయుక్త మీనన్ ఒక కుటుంబానికి కావాల్సిన అన్నీ రకాల దుస్తులను అందుబాటులో ఉంచడం లక్కీ ప్రత్యేకతగా పేర్కొన్నారు. షాపింగ్ మాల్ యజమానులు శ్రీను, రత్తయ్య, స్వామి వారి కుటుంబ సభ్యులకు అతిథులందరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, మేయర్ గంగాత సుజాత పాల్గొన్నారు. షాపింగ్‌మాల్ ప్రారంభం సందర్భంగా బుధవారం సాయంత్రం దక్షిణ బైపాస్ నుంచి లక్కీ షాపింగ్ మాల్ వరకు జబర్దస్త్ టీం ద్వారా ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: జరిమానా కంటే హెల్మెట్ ధరించడమే మేలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా న్యాయస్థానాల సముదాయం వద్ద హెల్మెట్ ధారణపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ హెల్మెట్ వాడకంపై వాహనదారులు, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం జిల్లాతోపాటు మండల న్యాయసేవ అధికారి కమిటీలకు ముందుగా అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అలసత్వంతో వ్యవహరిస్తే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. టూ వీలర్ వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడం శ్రేయస్కరమని చెప్పారు. అదనపు జిల్లా న్యాయమూర్తి డి.అమ్మన్నరాజా, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ నరసింహరాజు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, సీనియర్ సివిల్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, అదనపు ఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, న్యాయవాదులు, ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాల విద్యార్థులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



చిన్నసుబ్బయ్య మృతదేహం

కొమరోలు : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొమరోలు సమీపంలోని అంకాలమ్మ దేవాలయం మూలమలుపు వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన ఆదోని చిన్నసుబ్బయ్య (62) కొమరోలులో పని ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా బేస్తవారపేట నుంచి పోరుమామిళ్ల వైపు వెళుతున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో చిన్నసుబ్బయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కౌలు రైతుకు ఇబ్బంది లేకుండా చూస్తాం

- ఇన్‌చార్జి ఏడీఏ బాలాజీ నాయక్

సాక్షి ఎఫెక్ట్..



మార్కాపురం:

కౌలు రైతుకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తామని మార్కాపురం ఇన్‌చార్జి ఏడీఏ బాలాజీనాయక్ స్పష్టం చేశారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కౌలురైతు కలవరం' అనే వార్తకు స్పందించారు. మార్కాపురం సబ్‌డివిజన్‌లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లోని రైతులకు పంట సాగు అర్హత పత్రాలపై గత వారంరోజులుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పత్రాలను స్వీకరించి గ్రామ రెవెన్యూ అధికారి లాగిన్స్ ద్వారా పత్రాలను అందిస్తామన్నారు. గత సంవత్సరంలో వర్షపాతం ముందుగా నమోదు కావడంతో ఈ సమయానికే పత్రాలు అందించామని చెప్పారు. ఈ ఏడాది ఇంకా తగిన వర్షపాతం నమోదు కాకపోవడం, గొట్టపు బావుల్లో నీరు అందుబాటులో లేకపోవడం వలన కౌలుకు తీసుకునేందుకు రైతులు కొంత ఆలోచిస్తున్నారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యంగా పెట్టుకున్న 15,268 పంట సాగు అర్హత పత్రాలు అందిస్తామన్నారు. ఇప్పటికే 60 శాతం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు కల్పించామని, మిగిలిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ఈ నెల 23లోపు అందిస్తామని చెప్పారు.

వినుకొండ హత్యపై ఖండన

మార్కాపురం: చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని భౌతిక దాడులకు పాల్పడటం సహించరాని విషయమని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజె) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. పల్నాడుజిల్లా వినుకొండలో బుధవారం రాత్రి జరిగిన హత్యను తాము ఖండిస్తున్నామని అన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలు బలికావద్దని, విద్వేషాలను వీడి శాంతి సామరస్యంగా జీవించాలన్నారు. పోలీసులు రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. పోలీసులు రాజకీయ వత్తిళ్లకు తలొగ్గక నిష్పక్షపాతంగా విచారణ చేయాలన్నారు. పార్టీలు మారే రాజకీయ నాయకుల కోసం వెర్రి అభిమానంతో ఒకరిపై ఒకరు హత్యలు, భౌతిక దాడులు చేసుకోవడం బాధాకరమైన విషయమన్నారు. మానవత్వాన్ని మరచి ఒకరినొకరు చంపుకోవడం, చంపడం ఇంకా దారుణమని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, హింస జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


చెట్టుపై నుంచి ఎగురుతూ..


ఆకాశంలోకి ఎగిరిపోయే..

ఆకాశ మయూరి

కంభం: పక్షుల అందాలు.. ప్రకృతి సోయగాలతో పోటీ పడుతుంటాయి. ఇక నెమలి పురి విప్పి నాట్యం చేస్తుంటే రెండు కళ్లూ సరిపోవు. స్థానిక ఏబీఎం పాలెంలోని చెట్లపై గురువారం ఓ నెమలి ప్రత్యక్షమైంది. సుమారు గంటకుపైగా చెట్లపైకి ఎగురుతూ సందడి చేసింది. సమీపంలో కొండలు ఉండటంతో అక్కడి నుంచి ఎగురుతూ వచ్చి ఉంటుందని స్థానికులు తెలిపారు. గృహాల మధ్య అది తిరుగుతుండటంతో ప్రజలు మిద్దెలపైకి ఎక్కి ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఫారెస్టు సిబ్బందికి సమాచారం అందించడంతో వారు దానిని పట్టుకునే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి తుర్రుమని ఎగిరి వెళ్లిపోయింది. అది ఆడ నెమలని స్థానిక ఫారెస్టు సిబ్బంది తెలిపారు.


వేప చెట్టుపై కూర్చొన్న నెమలి

శభాష్ థామస్

- 71వ సారి రక్తదానం



జీజీహెచ్‌లో రక్తదానం చేస్తున్న థామస్ మక్కెన

ఒంగోలు టౌన్: అత్యవసరంగా రక్తం అవసరమైన నాగమణి అనే ఒక మహిళకు రక్తదానం చేసి ఆదుకున్నారు థామస్. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నాగమణి అనే మహిళకు అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ఆమె బంధువు నాగార్జున ద్వారా తెలుసుకున్న ఎంఎంఆర్ ఫౌండేషన్ అధినేత థామస్ మక్కెన వెంటనే జీజీహెచ్‌కు చేరుకొని రక్తందానం చేశారు. థామస్ గతంలో 70 సార్లు రక్తం దానం చేసి ఉన్నారు. ఇప్పుడు మరోసారి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. బాధిత మహిళ కుటుంబసభ్యులు, బంధువులు థామస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 71 సార్లు రక్తదానం చేసి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారని వైద్యులు ఆయన్ను ప్రశంసించారు.